



సుబ్బారావుని అందరూ "డి పి గా డు" అంటారు. డి. పి గాడంటే ధర్మపిండం గాడని అర్థం. ఎంత పరిచయం లేని మనుష్యులగ్గరైనా తనకు కావలసిన నిత్యావసర ఖర్చులనుండి సిగరెట్టు ఫీజు వరకూ కేవలం మాటల్చెప్పి అప్పులంగా వసూలు చేయగల నేర్పరి, వాడు. అయితే అందరి దగ్గరా సాగే వాడి ఆటలూ పాటలూ అప్పలమ్మ దగరా. దాని కూతురు అప్పాయమ్మ దగ్గరా సాగ లేదు.

అప్పలమ్మ నిన్నటికి నిన్నటికి నిన్న డిపి గాడ్ని రోడ్డుమీద నిలేసి "నీ యింటో పాచి పని చేసినందుకు పాతిక పైచిలుకు ఇయ్యాల! రేపటోగా ఇయ్యపోతే నీ బతుకు బండకేసి వుతుకుతా" అంది

నిన్నరాతిరి దాని కూతురు అప్పాయమ్మ "సీ ఒక్క సిగ్రెట్ ముక్క కొనెట్టలేనోడివి నడుంమీద సెయ్యేత్తున్నావ్ సిగ్గునేదూ" అని చీదరించుకుంది.

తల్లీ కూతుళ్ళ మాటల్తో డిపిగాడు పొయ్యిమీది అన్నంలా. నీళ్ళల్లో సున్నంలా వుడికేడు. ఎన్నడూ లేనిది పౌరుషం తెచ్చుకున్నాడు. మీనాలేని మూతిమీద వుంగరాల్లేని వేళ్ళతో సవరించు కున్నాడు.

"సేయ్ అప్పీ! రేపీపాటికి నీ ఋణం నీ అమ్మ ఋణం. రూపాయలూ అణాలూ పైసల్తో కాదు వులూ, మణుగులూ, వీశెల్తో, లేపోతే పౌన్లూ షిల్లింగులూ పెన్నీల్తో. ఎందులో కావాలంటే అందులో తీర్చేస్తానే. నీ ముఖం అప్పుడేచూస్తానే."


అనేసి రోడ్డున బడ్డాడు. రోడ్డున పడి యీ డబ్బులు ఎవడికి డిపి తగుల్తాడూ అని ఆలోచిస్తూ పెద్ద బజారు గుండా చిన్న బజారు కొచ్చేడు. వచ్చి నల్లగా సన్నగా పొడుగ్గావున్న మానవాకారం జెండాకర్రలాఅటూఇటూవూగుతూతనవేపేరావటం గమనించేడు. గమనించి అది తనకు తెలిసిన ఆకారమే అని గ్రహించేడు. గ్రహించి టోపీ పెట్టుకున్నంత సంబరపడి పోయేడు. వెంటనే వాడి బుర్రలో అయిడియా బాంబ్ ప్రేలింది. దాంతో మనదేశంలో ధరలు పెరుగుతున్నంత వేగంలో ఆ మానవాకారం దగ్గిరకెళ్ళి రెండు చేతు లె త్తి "నమస్కారం నాగానంద్‌గారో" అన్నాడు.

నాగానంద్ అని పిలువబడిన ఆ మానవాకారం కారంలేని కూర తిన్న మొహంపెట్టింది. తర్వాత లోలోనే గొణుక్కున్నట్లు అంది - "నా పేరు ముత్యాలరావు గాదా! నాగానంద్ అంటావేవిటీ' అని!

డిపిగాడికి సందుదొరికింది. "నో నానో! మీరు నా మాట వినాలి! మీ పేరు మార్చుకోవాలి! లేపోతే నేను కాఫీ మానేస్తానంతే!"

మానవాకారం మొహమాటపడ్డది.

మళ్ళీ డిపిగాడు టోపీ సవరించేడు. "మీ రిలా నడుస్తూ వస్తున్నారా; నేను ఆ సందుచివర్నుండి చూసే, అచ్చు దేవానంద్ నడిచినట్టే వుంది. అరె. దేవానందైతే ఇలా రోడ్డంట ఎందుకు నడుస్తాడూ అన్న అనుమానం రాకపోలేదు. ఆ! ఇవి కరువు రోజులుకదా ఏవైనా చందాలకి బయల్దేరేడేమోలే అని సరిపెటుకున్నాను. తర్వాత నాలుగంటే నాలుగే అడుగులు ముందుకు వేసేను. నటసామ్రాట్ నాగేశ్వరావ్ నవ్వుతూ కన్పించేరు. గుండె స్పీడెక్కి నేనూడా స్పీడుగా ఇక్కడికొచ్చి చూస్తే...మీరు! ఇద్దరు మహానటుల ఆకారాలనూ అలవాట్లనూ పుణికి పుచ్చుకున్న మీరు...... ముత్యాల్రావ్‌గా చెలామణీ అవటమా!? కళామతల్లికి ఇంతటి ద్రోహమా! కళాకారుడంటే ఇంతటి




వేళాకోళమా! నేన్సహించలేనుసార్! మీరు నా మాట వినాలి! పేరు మార్చుకోవాలి లేకుంటే ఓ పెన్సిల్ తీసుకొని నా కర్ణభేరులకు చిల్లులు పెట్టెయ్యండి. మిమ్మల్ని అందరూ ముత్యాల్రావ్ అంటుంటే నేను వినలేను." మాటల మధ్యలో డిపిగాడు రెండు కన్నీటిబొట్లు జేబులో వేసుకున్నాడు (తర్వాతెప్పుడైనా వాడుకోవచ్చునని)

ముత్యాలగిని దొరికినట్లుగా ముత్యాల్రావ్ వుబ్బిపోయేడుగాని తబ్బిబ్బవలేదు. సిగ్గుపడి పడనట్లుపడుతూ, "నా అభిమానులంతా ఇలాగే అంటున్నారు డిపిగారూ! వారి సలహాల్లో, ముఖ్యంగా మీ సలహాలో నాకు మంచే కనిపిస్తుందిగాని చెడు గుడి ఇవతల ఎక్కడా కనిపించటంలేదు. అందుకే పేరు మార్చుకుంటున్నాను. ఇవాల్టినుండి నా పేరు నాగానంద్! ఈ సందర్భంలో చిన్నవిండ్! ముందర్ హోటల్కెళ్దాం పదండి" అంటూ హోటల్లోకి నడిచేడు.

హోటల్లో సర్వాధికారితోఒకమాటనాగానంద్‌తో మరోమాట ఏకబిగిన మాటాళ్ళేక డిపిగాడుసతమత మయ్యేడు. మాట్లాడుతూన్న నాగానంద్ కళ్ళల్లో ఏవో పడినట్టయి రెప్పలు రెప రెపలాడించేడు. అది చూసిన డిపిగాడు బోల్డంత ఉత్సాహంతో చప్పట్లు చరుస్తూ "సార్ దేవదాసు సినిమాలో నాగేశ్వర్రావు గారు ఓ సీన్లో అచ్చం మీలానే కళ్ళు ఆర్పేరుసార్! ఎంతబాగుందనీ " అన్నాడు.

నాగానంద్ వలుసు సంగతి మర్చిపోయేడు. "నేను దేవదాసు పిక్చర్మొత్తం ప్రాక్టీస్ చేశానండీ. మచ్చుకు ఓ సీను యాక్ట్‌చేస్తాను చూడండీ" అంటూ సర్వర్ అప్పుడే తెచ్చిపెట్టిన కాఫీగ్లాసును మధుపాత్రలా చెంపకు ఆనించుకున్నాడు. చెంప 'చెళ్ళు" మనక 'చుర్" మంది. నాగానంద్ "కేర్" మని అరుస్తూ గ్లాసును ఒదిలేసేడు. ధవళ వస్త్రాలు "కాఫీరాగా"న్ని ఆలాపించినై.

బిత్తరపోయిన నాగానంద్ తేరుకుని (అప) హాస్య నటుడు ట్రాజెడీ ఫీలింగ్ పెట్టినట్లు "సుగంధకాఫీ" తాగిన ముఖంపెట్టి "హుం! మహానటులంతా ఇటువంటి కష్టాలెన్ని అనుభవించారో కదా" అన్నాడు.

డిపిగాడు పప్పులుసులో పెద్దఉల్లిపాయలు వుడుకు

తున్న సరళిలో నవ్వేడు. "మహాప్రభో, మీరు మహానటులయ్యే సూచనలు హోటల్ కాఫీలో ఈగల్లా, సినిమా కుర్చీల్లో నల్లుల్లా కన్పించక కన్పిస్తున్నై. మీరు మద్రాసెళ్లి సినిమాఛాన్సు కొరకు ఎంత త్వరగా "ట్రై" చేస్తే అంత మంచిది".

నాగానంద్ వాగులా పొంగేడు. ఇంతవరకూ ఇటువంటి సలహా ప్రోత్సాహం ఎవరూ ఇవ్వక పోవటంతో ఇప్పుడు వాటిని అందజేసిన డిపిగాడి మీద ఎక్కడలేని 'ఇది" పుట్టుకొచ్చి వాడి చేతులు పట్టుకున్నాడు. ఇవి కాళ్ళే అనుకోండి గురూగారూ! మీరు నా మాట మన్నించి నాతో మద్రాస్ వచ్చెయ్యండి. వేషాలు సంపాదించటంలో మీ సహాయ సహకారాలు అందజెయ్యండి! 'వూ' అనండి ప్లీజ్!"

డిపిగాడు తిరుగుతున్న ఫాన్ కేసిచూస్తూకాస్సేపు ఆలోచించేడు. "మీరింత యిదిగా అడుగుతున్నారు. గనక నాకూ రావాలనే వుంది. కాని నాకు ఇక్కడ కొన్ని అప్పులురావలసినవి ఇవ్వవలసినవి వున్నై!"

"ఇవ్వవలసినవాటి బాధ్యత నాది "

* * * * *

మతివున్న మామగారికి మస్కాకొట్టి, పెళ్ళాని కేవో ఆశలుపెట్టి, బాంక్ బాలెన్సుకు ఎసరున్నా చుట్టి నాగానంద్ డిపి సమేతుడై మద్రాస్ చేరి ఓ ఖరీదైన హోటల్లో ఖురవలేని రూళ్ళతో దిగేడు.

ఆరగింపు సేవ ముగిసేక డిపిగాడు తనకు తెలిసిన ఓ ఫిలిం కంపెనీ ఉందంటూ టెలిఫోన్ డైరెక్టరీ అరగంట తిరగేసి ఓ నంబరుకు 'డయల్' చేసి. "అన్నింటా యోగ్యుడైన నటుడు హోటల్ 'ఫలానా'లో వున్నాడు కావాలిస్తే వచ్చి కల్సుకో వచ్చు" అని చెప్పేడు.

అవతలి కంఠం నోట్లో నీళ్ళు పోసుకుని పుక్కిలించినట్లు నవ్వింది. నవ్వి 'నిర్మాత దర్శకులు రమణాచల స్టుడియోలో వున్నారు వెళ్ళ"మంది.

డిపిగాడూ నాగానంద్ సంతోషంగా భుజాలెగరేసుకుంటూ 'రమణాచల స్టుడియో' వేటకి బయల్దేరేరు టాక్సీ బాడుగ పది రూపాయలవరకు పెరిగాక వాళ్ళతో ఓ పెద్దమనిషి చెప్పేడు- "బాబులూ! రమణాచల స్టుడియో గతంలో వుండేది! వర్తమానంలో దాని పేరు "మూన్ స్టుడియో! భవిష్యత్‌లో ఏం పేరు పెడ్తారో తెలీదు కదా!" అని. చచ్చీ చెడీ (?) నిర్మాత, దర్శకులూ "వక్కెర మనసులు" షూటింగ్ సందర్భంగా 'మూన్ స్టుడియో'లో "ఏ" ఫ్లోర్‌లో వున్నారని తెలుసుకుని డిపిగాడూ, నాగానందూ అక్కడికి పరుగెత్తి కెళ్ళేరు.

ఫ్లోర్‌లోకి దూకుదామనుకున్న యిద్దర్నీ, గేటో వున్న మీసాల కాపలావాడు ఆపేసి "లోపల హీరో గారు స్టంటు చేస్తున్నారు. బయటవాళ్ళు చూస్తే మూడు పాడయి తమ తలను తామే నరుక్కుంటారు. గనుక డైరెక్టర్‌గారు ఎవర్నీ లోనికి రానివ్వొద్దన్నారు" అన్చెప్పేడు.

నాగానందూ, డిపిగాడూ పుస్సురని వెనక్కి తిరిగేసరికి సన్నగా ఎండిపోయి కోటు స్టాండుల్లాటి మనుషులు దారికి అటు ఆరుగురు. ఇటు ఆరుగురూ నిలబడి వున్నారు. నాగానంద్ కళ్లు నులుముకుని చూసేడు. వాళ్ళందర్నీ ఎక్కడో చూసినట్లనిపించింది. ఆ పన్నెండు మందిని మార్చి మార్చి చూసి కల్తీలేని పాలు కొన్నవాడిలా ఎగిరి గంతేశాడు. గబగబ లైన్లో నిలబడి వున్న మూడోమనిషి దగ్గర కెళ్ళి " సన్యాసి విజయం' సినిమాలో రాజుగారిచేత కొరడాదెబ్బలు తినే వందమంది సన్యాసుల్లో మీరూ ఒకరు కదూ" అనడిగేడు.

# 1

ఆ సన్యాసి ఎగిరి పర్చీ ఎక్కి "నన్నూ ప్రేక్షకులు గుర్తిస్తున్నారండోయ్' అంటూ చిన్నపోజు పెట్టాడు. ఆ ఆనందంలో రెండ్రోజులుగా వాసన చూసి దాచిపెట్టుకుంటున్న చార్మినార్ సిగరెట్ తీసి వెలిగించేడు. వెలిగించేక తెలిసింది - ఎదుట పెద్ద మనిషికి 'ఆఫర్' చెయ్యకుండా తను సిగరెట్ తగలేస్తున్నాడని! నాలిక్కరుచుకుని పక్కనేవున్న జెరిన్ చొక్కాని అప్పడిగేడు. జెర్రిన్ చొక్కా సిగరెట్ తీసియిస్తూ 'దీంతో మూడు" అంది. సన్యాసి సరేనని సిగరెట్ వెచ్చి 'ఫాన్' కిచ్చేడు.

---

మిత్రులు

ఒకడు : ఒరేయ్! ఉన్నట్లుండి ఒక మాంచి విట్టుచెప్పు "

రెండవవాడు : మరి నివ్వు గట్టిగానవ్వు; తానని మాటివ్వు.

---

తెల్లబోయిన నాగానంద్ తేరుకుని సిగరెట్ అంటించేడు

ఆ తర్వాత తెలిసింది - అక్కడ నిలబడిన పన్నెండు మందీ 'ఎక్స్ట్రా" నటులనీ 'వక్కెర మనసులు" డైరెక్ట్ చేస్తున్న వ్యక్తే 'వంకర మనసులు" సినిమా తీస్తున్నాడనీ, ఆ సినిమాలో మూణ్ణిముషాలపాటు కనిపించే ఒక సన్యాసి, ఒక బికారి, ఒక తాగుబోతు పాత్రలు ఖాళీగా వున్నాయనీ, ఆ పాత్రలు తమకిప్పించమని అడిగేందుకు యీ పన్నెండు మంది పడిగాపులు పడుతున్నారనీ, యిప్పుడే డైరెక్టర్ గారొచ్చి తను మళ్ళీ వచ్చేవరకు 'కాస్త నిలబడండి" అన్నారనీ, అందుకే అందరూ నిలబడి వున్నారనీ!!

మూణ్ణిముషాల మూడు పాత్రలకు మూకాల్ పన్నెండుమందా అని మీరు ఆశ్చర్యపోతుంటే 'వంకర మనసు'ల్లో తాగుబోతుపాత్ర తనకే లభించినట్లు పరవశించిపోయేడు, నాగానంద్. ఆ వేషంలో తారాపథంలో ఓ వెలుగు వెలగటం ఖాయమనుకున్నాడు. ఆ మాటే చెప్దామని పక్కకి తిరిగితే పక్కన డిపిగాడు లేడు. ఎవడికి తగిలేడో డిపి. కిళ్ళీగిన్నీ జమాయించి 'బి' ఫ్లోర్ వైపునుండి నాగానంద్ దగ్గరకొచ్చి, పక్కకు పిలిచి, చెవులో మాటలు తొలచేడు— "వంకర మనస్సుల్లో తాగుబోతు వేషం [illegible] ఆ తుమ్మ చెట్టుకింద కూచున్న మనిషికి అయిదొందరూపాయలివ్వాలి!"

నాగానంద్ బెదరిపోయి తుమ్మచెట్టు చేతుల్లో అయిదొందలూపోసి తన చేతులు దులుపుకున్నాడు' తుమ్మచెట్టు డబ్బుతీసుకొని 'అగ్రిమెంట్ పేపర్స్ టైప్ చేస్తానె వెళ్లు అంది. నాగానంద్ తేలిగ్గా శ్వాసతీసేడు. డిపిగాడు ఇంకా తేలిగ్గా వూపిరి తీసేడు.

ఆ రోజుకు మరో చోటికి పోదలచుకోక యిద్దరూ హోటల్ చేరుకున్నారు. నాగానంద్‌ని హోటల్లో రిహార్సిల్స్ వేసుకుంటూండమని చెప్పి డిపిగాడు షూటింగ్ చూడ్డానికి వెళ్ళేడు.

'వంకర మనసులు' చిత్రంలో తన నటనను హైలైట్ చేసేందుకు నాగానంద్ అద్దం ముందు కూచుని డెభాగులేని రిహార్సిల్స్ మొదలెట్టేడు. ఒట్టి మొఖం పనికి రాదన్నాడు. చేతికిమల్లెపూల దండలా ఎర్ర తాడొకటి కట్టుకున్నాడు. 'ఎఫెక్టు' కోసం జింజర్‌సోడా తాగి 'జగమే మాయా' అంటూండగా డిపిగాడు ఓ లావుపాటి మనిషిని వెంటేసుకుని తలుపులు తీసుకొని లోపలికొచ్చేడు.

నాగానంద్ కాస్త తొట్రుపడ్డాడు. డిపిగాడదేమీ పట్టించుకోలేదు నాగానంద్‌తో "వీరే హరోం హరహర ఫిలిమ్స్ నిర్మాత గద్దకాయల అచ్చయ్యగారు వీరు తీసే ఈస్ట్‌మన్ కలర్ పిక్చర్‌లో పరిచయం చేసేందుకు కొత్త హీరో కావాలని పాత రోడ్లన్నీ తిరుగుతుంటే మీ ఫొటో తీసి చూపేను. అప్పట్నుండి మీరు తప్ప వేరొకరు తమ పిక్చర్‌లో హీరో వెయ్యటానికి వీల్లేదంటున్నారు" అన్నాడు.

తెల్లని గ్లాస్కో లుంగీ, ఖద్దరు సిల్కు లాల్చీలో కళ్ళద్దాల పెద్దమనిషి నాగానంద్‌కు మిదె మిది దేవరలా కన్పించేడు కరిగి కాళ్ళమీద పడ్డే తలో 'వద్ద'ని వారిస్తూ అచ్చయ్యగారు, "నాయనా! ఇందాకట్నుండి నీ నటన తలుపు సందుల్లోంచి చూసేను. ముగ్ధుణ్ణయ్యేను. ఇన్నాళ్ళూ నా చిత్రంలో ఎవరో కొత్త హీరోయిన్‌ను బుక్ చేద్దామనుకున్నాను. కాని నిన్ను చూసేక అభిప్రాయం మార్చుకున్నాను. నీ పక్క హిందీ సాధన కాపోతే సైరాబాను, వీళ్ళు తప్ప మరొకరు మరొకరు నిలవలేరనిపిస్తోంది. అందుదాటులో లేరుగాని యే సోఫియా లారెన్నో, అవాగార్డనర్‌నో నీ పక్కన బుక్ చేద్దును. అన్నట్టు యీవిడ మీ ఇంట్లో పని మనిషి వేషం వేస్తుంది" అంటూ అందమైన, ఎంతో అందమైన, అందాతి అందమైన అమ్మాయి ఫొటో తీసి చూపేరు

నాగానంద్ కాలంకాని కాలంలో కమలా పళ్ళు తిన్నట్లు మొఖంపెట్టేడు. ఆ క్షణంలో కళ్ళు మూసుకుని గుండెమీద చేయి వేసుకుని ప్రతిన బూనేడు - 'ఎన్ని కష్టనష్టాలకైనా సరే, ఓర్చుకుని యీ పిక్చర్‌లో వేషంవేసి తీరుతాను అని!

అచ్చయ్యగారు భారీ శరీరాన్ని ఈజీ చైర్లోకి

చేరవేశారు. వెంటు పులిమిన చేతి గుడ్డతో ముఖం తుడుచుకున్నారు. "నాయనా నాగానంద్! మన సినిమాకు ఖర్చు పదిలక్షలౌతుంది. నా దగ్గరేమో తొమ్మిది లక్షల తొంభైవేలు 'హార్డ్ కాష్' వుంది. నాకేమో రెండు చేతులూ కలిస్తేనేగాని రంగంలోకి దిగాలని లేదు. అవతల మాటలూ పాటలూ రెడీగా వున్నై. చిల్లర నటులు, సాంకేతిక నిపుణుల ఎన్నిక పూర్తయింది. విన్ననే జెట్‌డోర్ యూనిట్‌తో కూడా 'సైన్' చేశాను. ఇంకొక్క పదివేలుంటే పదిరోజుల్లో వచ్చే దక్కని ముహూర్తానికి సెట్స్‌మీది కెళ్ళొచ్చు. అయితే యీ పదివేలూ వాళ్ళని వాళ్ళని అడగటం నాకు సుతరామూ ఇష్టం లేదు. పైగా మన బొమ్మకు మనమే డిస్ట్రిబ్యూటర్లం గూడాను. కనుక...అప్పుడివి...నువ్వు గనుక పదివేలు సర్దావంటే వచ్చే నెల్లో నీ నటనకు గాను లక్షరూపాయలూ, వడ్డీతోసహా పదివేల రూపాయలూ పారితోషికాల్లో పెట్టి సమర్పించుకుంటాను."

నాగానంద్‌కు నమ్మకమైతే కుదిరిందిగాని పదివేలనేసరికి పదిసార్లు ఆలోచించవలసి వచ్చింది. నాగానంద్ దేనికో సంశయిస్తున్నట్లనిపించింది అప్పయ్యగారికి.

"మీరు మరోలా అనుకోపోతే పదివేలకూ ప్రోనోటు వ్రాసిస్తాను. లక్షరూపాయలకు ఎగ్రిమెంట్ రాసుకుందాం!" అప్పయ్యగారి మాటల్లో కొద్దిగా, సూక్ష్మంగా బాధ కనిపించింది.

పెద్దమనిషిని అనుమానించి బాధించినందుకు నాగానంద్ తనను తానే తిట్టుకున్నాడు. లోలోనే లెంపలు వాయించుకున్నాడు. గభాల్న అప్పయ్యగారి చేతులు పట్టుకొని "అమ్మమ్మా అలా అనకండి. పది లక్షలు పెట్టుబడి పెట్టేవారు పదివేలు తీర్చలేకపోతారా! ప్రోనోటు వద్దూ పాడూ వద్దు. నాల్రోజుల్లో పైకమిచ్చేస్తాను" అన్నాడు.

అప్పయ్యగారు చేతులెత్తి తల నిమిరేరు. నాగానంద్ పరవశుడై, వాళ్ళనటుపంపి తను ఇటు ఇంటికో టెలిగ్రాం కొట్టేడు — "వెంటనే పదివేలు పంపండి లేకుంటే నేను మీకు అల్లుణ్ణికాదు. మీ అమ్మాయికి మొగుణ్ణికాదు."

తిరుగుటపాలో పదివేల్రూపాయలకూ బాంక్ డ్రాఫ్టుతోపాటు మామగారి ఉత్తరంకూడా అందింది. "అల్లుడూ! నీకు పంపుతున్న డబ్బు నీ పేరవున్న రెండెకరాల మాగాణి అమ్మితే వచ్చింది. ఇక నీ ఖర్ర పెంగాణి బొచ్చెలా పగలగొట్టుకున్నా ఎర్రని ఏగాణికూడా రాల్చేదిలేదు" అని.

నాగానంద్ డ్రాఫ్టుచూసి ఆనందపడి లెటర్ చదివి చిరాకుపడ్డాడు. వెంటనే నిద్రపోతున్న డిపిగాడ్ని లేపి వెంటబెట్టుకుని 'హరోం హర హర ఫిలిమ్స్' ఆఫీస్ కెళ్ళేడు.

ఆఫీస్‌రూం 'నీట్'గా వుంది. ప్రొడ్యూసర్‌గారు రివాల్వింగ్ చెయిర్లో పడుకుని వున్నారు. ఎదురుగా కుర్చీలో ఓ వయ్యారిభామ కూచుని తనెన్ని నృత్య ప్రదర్శనాలిచ్చిందీ, ఎంతమంది తన నటనకు నాకెట్లకూ మెడల్సూ, రూపాయలనోట్లు గుచ్చిందీ చెప్పుకు పోతూంది. ప్రొడ్యూసర్‌గారు కళ్లు మూసుకుని 'ఊ' కొడుతున్నారు.

నాగానందూ, డిపిగాడూ ఆమె వాక్కు తెలియచేస్తున్నట్టుగా దగ్గబోయి మూలిగేరు. అప్పయ్యగారు కళ్ళుతెరచి నాగానంద్‌ను చూసి, అమిత శ్రద్ధాభక్తులతో కుర్చీలో నుండిలేచి "రండి రండి నాగానంద్ గారూ! మిమ్మల్ని చూశ్ళేదు. క్షమించండి. ఈవిడేదో వేషం కావాలంటుంటే..." అని చేతులు నలుపుకున్నారు.

వయ్యారిభామ ఏమీ పట్టనట్లు కుర్చీలోంచి కదల్లేదు. అప్పయ్యగారు ఆవిడ పక్కకెళ్ళి గొంతు తగ్గించి "హీరోగరొస్తే నిలబడవేం" అని కసురుకున్నారు.

"అరెరె! హీరోగారా! క్షమించండి" అంటూ మాటల్లోనూ, చేతల్లోనూ బెదిరిపోతూ లేచి నుంచుంది వయ్యారిభామ.

నాగానంద్ తీపిగా అప్పయ్యగార్ని పక్కగదిలోకి పిలిచి డబ్బిచ్చేసు. అప్పయ్యగారు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ 'మీరు ఆ వంకర మనసులు షెడ్యూలు రేపటిరోజుల్లో పూర్తి చేయండి. ఈలోగా నేను స్టుడియో వ్యవహారాలు చూస్తాను" అన్నారు. ముందు నాగానందూ, తర్వాత డిపిగాడూ తల తాటించేరు.

మర్నాడు 'వంకర మనసులు' షూటింగ్‌కు రమ్మని నాగానంద్‌కు కబురొచ్చింది. డిపిగాడ్ని

---

**తండ్రి:** "ఏరా బాబూ వాణ్ణెందుకు కొట్టావ్?"

**పిల్లవాడు:** "అమ్మ ఎవరైనా కొడితే తిరిగి కొట్టమంది."

**తం:** మరి ముందే కొట్టావేం?

**పి:** ఇప్పుడేంబోయింది? వాడ్నే తిరిగి కొట్టమను.

---

"హరోం హర హర ఫిలిమ్స్" వ్యవహారాలు చూసేందుకు నియమించి తనొక్కడే స్టుడియో కెళ్ళేడు. అక్కడ గ్రీన్ రూమ్‌లో నాగానంద్‌కు మేకప్‌చేసి పొద్దుట ఎనిమిది గంటలకు "వెయిటింగ్ హాల్"లో కూచోబెట్టేరు. గంటలు గంటలు గడచిపోతున్నై. ఉదయం మధ్యాహ్నమైంది. మధ్యాహ్నం సాయంత్రం అయింది. సాయంత్రం రాత్రైంది. మళ్ళా రాత్రి ఉదయమైంది ... ఇలా మూడ్రాత్రిళ్ళూ మూడు పగళ్ళూ గడిచేక ఓ శుభోదయాన సొక్కి సోలివున్న నాగానంద్‌ను సెట్లోకి పిలిచేరు. అదే ఆఖరిసీను. అమ్మాయి డాన్స్‌చేస్తుంటే ఈయన తాగి(నట్లు) తందనాలాడాలి. చివరకు బోర్లాపడి గిరగిరా తిరుగుతున్న డాన్సర్ కేసి తలెత్తి చూడాలి. ఆ పాత్రను డైరెక్టర్‌చేత నానామాటలూ అనిపించుకొని ఎలాగో అయిందనిపించాడు.

అదయిపోగానే డైరెక్టర్‌గారు నాగానంద్ దగ్గరకొచ్చి "రుద్రప్రతాప సింహుడి వేషం వేస్తావా" అనడిగేరు.

అదేదో సైన్యాధిపతి వేషం అనుకుంటూ అతిశయించిన ఆనందంతో "అలాగేసార్" అన్నాడు.

అని మేకప్‌మాన్ దగ్గరకెళ్ళేడు. ఆయన మాసి వాసనకొడుతున్న ఓ సిల్కు బట్టల జత తీసిచ్చి కట్టుకోమన్నాడు. నాగానంద్ నెత్తిన తలకంటే పెద్దదైన టోపీని పెట్టేరు. ముఖానికి సున్నంగొట్టి నట్టు రంగుకొట్టేరు. నాగానంద్ అద్దంలో చూచుకొని "సైన్యాధిపతి మేకప్ ఇదా" అన్నాడు ఆశ్చర్యంగా.




మేకప్‌మాన్ ఫక్కున నవ్వేడు. అంతలోనే సీరియస్ అయిపోయి "నువ్ సైన్యాధిపతివి కావోయ్. హీరోచేత తన్నులు తినే సామాన్య సైనికుడివి పోషా వైమవుతుంది" అంటూ సెట్లో పడేట్టు నాగానంద్‌ను ఒక్క తోపుతోశాడు.

## 2

హీరోగారు సెట్లో వున్నారు. డైరెక్టర్‌గారు నాగానంద్ కేదో చెప్పి ముందుకు తోసి 'టేక్' అన్నారు. ప్రొడ్యూసర్‌గారు తెప్పించిన లేని తాగిన హుషారులో వున్న హీరోగారు చేతిలోని కర్రను గిర్రున తిప్పుతూ ఒళ్ళంతా కదిలేలా ఎగురుతూ ఎదురుగావున్న నాగానంద్ కాళ్ళకు పెట్టింది పెడీల్న కొట్టేరు.

"నా కాళ్ళు విరిగినయ్ బాబోయ్' అంటూ నాగానంద్ కిందపడి దొర్లేడు.

సీన్ నాచురల్‌గా వచ్చిందని ఆసి డైరెక్టర్‌గారు ఆయకునేంతలో హీరోగారు 'అబ్బా' అన్నాడు. కెమేరా ఆగింది. యూనిట్ యూనిటూ హీరో చుట్టూ మూగింది "ఏమైందండి సార్' అని.

హీరోగారు చెప్పేదంతా ముఖంలోనే చూపుతూ 'ఆ 'ఫూల్'ని కొట్టటంలో చిటికెన వ్రేలు బెణికి పట్టినిస్తోంది" అన్నారు.

అందరూ 'డాక్టర్ డాక్టర్' అంటూ పరుగెత్తేరు.

నాగానంద్ కింద దొర్లినవాడు దొర్లినట్లే వున్నాడు. కళ్ళ వెంబడి నీళ్ళు, కాళ్ళ వెంబడి రక్తం ప్రవహిస్తున్నై. అందరూ చూస్తున్నారు.

పోతున్నారు-ఎవరికి వారు పట్టించుకోకుండా, ఇక తనగతి అంతేనని తెలుసుకున్న నాగానంద్ చిన్నగా బయటకొచ్చి పెద్దగా ఏడ్చేడు. పేరున్న హీరో 'అబ్బా' అనగానే దెబ్బ తగిలినట్లేనా! ఎక్స్ట్రా గాడికి కాళ్ళు విరిగినా లెక్కలేదా-ఇదేమి న్యాయం కళామతల్లి" అని పెద్దపెట్టున ఏడ్చేడు. ఆ ఏడ్పు విన్న డైరెక్టరుగారూ, నిర్మాతగారూ బయటికొచ్చి మళ్ళీనోరెత్తితే గొంతు నొక్కేస్తామన్నారు.

నాగానంద్ నోరు మూసుకుని కళ్లు తెరచుకుని హోటల్ కొచ్చేడు. గదిలో యెక్కడా డిపిగాడి ఛాయలు కనిపించలేదు. మంచంమీద నలిగిన మల్లెపూలున్నై. హాంగర్లకు గుడ్డలేమీలేవు.

నాగానంద్ టేబుల్‌మీద చూశాడు. ఆశ్చర్యం! నాగానంద్ సూట్‌కేస్‌కింద డిపిగాడిసూట్‌కేస్ లేదు. ఆతృతగా తనసూట్‌కేస్ తెరచి చూసేడు, అందులో వుండాల్సిన రెండు వందల రూపాయలనోట్లూ లేవు బాగుచేయిద్దామని దాచిన రిస్ట్‌వాచ్ లేదు.

దృఢపడిన అనుమానంతో నాగానంద్ హడావుడిగా హరోం హరహర ఫిల్మ్స్ ఆఫీసుకెళ్ళేడు. ఆఫీసుతాళం వేసుంది — పైన బోర్డులేదు. నాగానంద్ రెండు మెట్లకు ఒకడుగువేస్తూ కిందికొచ్చి ఇంటి ఓనర్లనడిగేడు "పై గదుల్లో వుండే సినిమావాళ్ళేరీ" అని.

ఇల్లుగలావిడె "వాళ్లు బకాయిపడ్డ నాలుగు నెలల అద్దె కట్టేసి నిన్నే గదులు ఖాళీ చేశారండీ" అంది.

మోసం తెలిసొచ్చింది. నాగానంద్ నెత్తీ నోరు బాదుకున్నాడు. "పదివేలు అచ్చయ్యగారూ, పదివేలు తీసినాడు' అంటూ ఘొల్లుమన్నాడు. గోడవంతా అర్థం చేసుకున్న ఓ బాటసారి (మద్రాస్‌కు పాత వాడేమో మనకిసినిమాల్లోకనిపి స్తేకొత్తనటుడేమరి) నాగానంద్ కన్నీళ్లు తుడిచి "ఏడ్వకు బ్రదర్ ఇటు వంటివి జరగటం మామూలే! ఇక్కడి కొచ్చిన కొత్తల్లో నావీ ఓ వెయ్యి ఇలాగే పోయినై! ఏడ్చి లాభం లేదుకానీ గూటికి చేరు" అని బోధించేడు. బోధ పూర్తికాగానే తనదారి తను చూసుకున్నాడు.

నాగానంద్ లేచి విషాద గీతం పాడుకుంటూ నడక సాగించేడు. నడుస్తూనే ఆలోచించేడు 'ఇంటి కెళ్ళిపోదామా' అని. వెళ్ళిపోదా మనుకుంటున్న వాడికి అభిమానం అడ్డొచ్చింది! యేమైనా సరే సినిమా వేషం సంపాయించాల్సిందే. పేరు తెచ్చుకోవాల్సిందే అన్న నిశ్చయానికొచ్చి వేరున్న ఓ ఫిలిం సంస్థ కెళ్ళి దర్శక నిర్మాత ముందు చేతులు చాచి "అయ్యా! వేషం ఇప్పించండయ్యా." అన్నాడు.

కవిగారు రాసిచ్చిన కథను తన ఇష్టమొచ్చినట్లు మార్చిపారేస్తున్న దర్శకనిర్మాత తలెత్తి చూసేడు. కళ్ళజోడు తీసి తుడిచిపెట్టుకున్నాడు. నాగానంద్‌ను తేరిపార చూసేడు. చూసి చిరాగ్గా "వేషాల్లేవ్ గీషాల్లేవ్ పోవయ్యా! దున్నపోతులా వున్నావ్ యేదైనా పనిచేసుకుని బ్రతగ్గూడదూ" అన్నాడు.

నాగానంద్‌కు కోపం ముంచుకొచ్చింది. నిర్మాత కాలర్ పట్టుకుని ఎడాపెడా వాయిద్దామనుకున్నాడు. గాని వాయించలేకపోయేడు. దిక్కులు పిక్కటిల్లేలా ఏడుద్దా మనుకున్నాడు. గాని ఏడ్వలేక పోయేడు. ముందు కళ్ళూ తర్వాత మొహమూ తుడుచుకుని గడప దిగేడు.

ఆ దిగటం దిగటం ఎన్నో గడపలున్న ఆఫీసులూ, గడపల్లేని ఆఫీసులూ తిరిగేశాడు, తన వేషం గురించి అడిగాడు. అందరూ 'చూస్తా' మన్నారే గాని 'చూశారు'గారు. ఒక డైరెక్టర్‌బాబు మాత్రం నాగానంద్‌ని నలభై కోణాల్నుండి చూసి తన 'పిక్చర్‌లో హీరో తర్వాత హీరో అంత పాత్ర ఇస్తాను ప్రొద్దున్నే రా అన్ని సంగతులు మాట్లాడొచ్చు" అన్నాడు.

నాగానంద్ మర్నాడు ప్రొద్దున్నే సిల్కు పంచె లాల్చీ కట్టి ఆఫీసు కెళ్ళేసరికి డైరెక్టర్ బాబూ సిగరెట్ పొగను విలాసంగా వదుల్తూన్నాడు. నాగానంద్‌ను చూడగానే 'క్వినైన్ మిక్చర్ త్రాగిన ముఖం పెట్టి "సారీ నాగానంద్! మీ కిద్దామనుకున్న వేషానికి హీరోయిన్ గారు మరో కుర్రాణ్ణి రికమెండ్ చేశారు! అతణ్ణి తీసుకోపోతే ఆవిడకు కోపం వస్తుంది. అంచేత మీకు మరో సారెప్పుడైన అవకాశం కల్పిస్తాను" అన్నారు.

నాగానంద్ ముఖం జేవురించింది. ఒంట్లోని రక్తమంతా ముఖంలో గూడుకట్టుకుంది. పళ్లు పట పట లాడినై. నిలువెత్తు మనిషి కుర్చీలోంచి దిగ్గున లేచేడు.

'సిగ్గులేదండీ మీకు ఆ మాటలనేందుకు! ఎవరో హీరోయిన్ చెప్పిందని మీ తెలివి తేట లుపయోగించి సెలక్ట్ చేసుకున్న నన్ను పీకేసి మరో అనామకుడికి చోటిస్తారా? మీకు కావలసింది హీరోయిన్‌కు నచ్చిన మనిషేగాని, పాత్రకు సరిపడిన వ్యక్తికాదా? పెద్దవారు అనుభవ మున్నవారు! మీరు చెయ్యవలసిన పనేనా ఇది!" నాగనంద్ కోపంతో వూగిపోయేడు.

డైరెక్టర్ బాబు ముఖంలోని గాంభీర్యం చెక్కుచెదరలేదు. అతిసహజంగా సిగరెట్ పీకను యాష్ ట్రేలో నొక్కేసి మెల్లగా కుర్చీలోంచి లేచి నాగానంద్ పక్కకొచ్చేడు. అతడి భుజంమీద చేయి వేసి తట్టుతూ, 'నువ్విక్కడ బ్రతకలేవు బ్రదర్! మీ వూరెళ్ళిపో!" అన్నారు.

నాగానంద్ విదిలించుకుని అయిదు నిముషాల్లో హోటల్ చేరుకున్నాడు. ముసుగుతన్ని పొడుక్కుందామనుకునేంతలో హోటల్ ప్రొప్రైటర్ వచ్చి బోర్డింగ్ లాడ్జింగ్ చార్జీలు నాలుగ్గంటల్లో కట్టకపోతే పోలీసుల కప్పచెప్తానన్నాడు నాగానంద్ బెంబేలెత్తిపోయి చేతికున్న వుంగరాలు, సూట్ కేసులోవున్న రెండు టెర్లిన్ పాంట్లూ, మూడు టెర్లిన్ షర్టులూ అమ్మి నాలుగొందలయాభై తీసుకుని హోటల్‌బిల్లు కట్టేసి సూట్‌కేస్ తీసుకుని స్టేషన్‌కు బయల్దేరేడు.

బరువుగా నడుస్తున్న నాగానంద్‌కు దార్లో సినిమా సన్నాసి కలిసి 'వంకర మనసులు' 'ప్రీవ్యూ' వేస్తున్నారని చెప్పేడు. నాగానంద్ తన వేషమన్నా చూసుకుందామని సినిమాసన్నాసితో అట్నుంచి అటే 'కృష్ణవేణి' కెళ్ళేడు. పిల్లాజెల్లా, ముసలి ముతకా, ఆడా మగా... అందరితోటీ థియేటర్ కిక్కిరిసి వుంది. టైము కాగనే 'బెల్' మ్రోగింది.

నాగానంద్ వుత్సాహంగా స్క్రీన్‌కేసి దృష్టి సారించేడు. సినిమా ప్రదర్శన మొదలైంది — ముగిసింది. కాని పద్దెనిమిది రీళ్ళ సినిమాలో నాగానంద్ ముఖమెక్కడా కన్పించలేదు. దిగాలుపడి చూస్తున్న నాగానంద్‌ను చూసి సినిమా సన్నాసి జాలిపడి "వెధవలోకం గురూగారూ! మీ సీన్లోని పాటనూ, మీ యాక్షన్నూ అపార్థంచేసుకుని సెన్సార్ వారు కట్ చేశారు! మీ "స్టంట్‌బిట్" ఎడిటింగ్‌లో పోయింది" అన్చెప్పేడు.

నాగానంద్ ఏడుపు దిగమింగేంతలో "మన ఎక్స్ట్రా నటుల సంఘంలో చేరతారా గురూగారూ" అనడిగేడు సన్నాసి

నాగానంద్ ముక్కు తుడుచుకుని, జుత్తుపైకి తోసుకుని "నా పేరు నాగానంద్ కాదు ముత్యాలరావు. నాకు నీ సంఘమూవద్దు, సినిమా వేషమూవద్దు, యీ త్రిశంకు స్వర్గమూవద్దు! మా వూరు పోతాను" అంటూ సెంట్రల్ స్టేషన్‌కు బయల్దేరేడు!

★

